సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 23 । జూన్ । 2025



ఏసీఏ అండర్-19 మ్యాచ్‌లు ప్రారంభం

ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆదివారం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. -8లో



అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ శాఖ జరిపిన దాడుల వివరాలను వివరించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.8/27.4

జిల్లాలో ఆదివారం 27.4 - 37.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.08 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

తిరుచ్చి వాహనంపై శ్రీనివాసుడు



తిరుచ్చి వాహనంపై శ్రీవారికి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్: బద్వేలు పట్టణంలోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీహయగ్రీవ హోమము, వేదస్వస్తి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ అంకయ్య, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బదిలీ ప్రక్రియ



బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన డీఈఓ కార్యాలయ అధికారులు

కడప ఎడ్యుకేషన్: కడపలోని డీఈఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన 1998,2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న 901 ఖాళీలను ప్రదర్శించగా జిల్లాలో ఉన్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు తమకు సంబంధించిన స్థానాలకు కోరుకుని బదిలీపై వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా 206 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులకు గాను 201 మంది బదిలీ కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. ఈ బదిలీ కౌన్సెలింగ్‌లో వైఎస్సార్ కడపజిల్లా డీఈఓ షేక్ షంషుద్దీన్, అన్నమయ్య జిల్లా డీఈఓ సుబ్రమణ్యం, డీఈఓ కార్యాలయ ఏడీ సీవి రామకృష్ణ, డీఈఓ కార్యాలయ సిబ్బంది సుదర్శన్‌రెడ్డి, శ్యాసుందర్‌రెడ్డి, శివప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డీఆర్వో కోరారు.

- డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు.
- ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో తమ అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

రెండో రోజు 155 మంది హాజరు



పత్రాలను పరిశీలించుకున్న అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం రెండవ రోజు ఆదివారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 15001వ ర్యాంకు నుంచి 32 వేల ర్యాంకులకు సంబంధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకుని తమకు సంబంధించి ధృవపత్రాలను పరిశీలించుకున్నారు. రెండవ రోజు కౌన్సెలింగ్‌కు 155 మంది అభ్యర్థులు హాజరై తమ ధృవ పత్రాలను పరిశీలించుకున్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, ఛీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ దామోదర్, వెరిఫికేషన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు...

జిల్లావ్యాప్తంగా 32000 నుంచి 50 వేల ర్యాంకులు వచ్చిన అభ్యర్థులకు సోమవారం కౌన్సెలింగ్ ఉంటుందని కో ఆర్డినేటర్ జ్యోతి తెలిపారు.

ఆ సీటు మాదే!



- ఏమైనా చేద్దాం... ఆ కుర్చీలోనే ఉందాం!
- ఓ సంఘంలో భర్త.... మరో అసోసియేషన్‌లో భార్య
- కుప్పలు తెప్పలుగా మెడికల్ సర్టిఫికెట్లు
- ఆఫీసు బేరర్ల లెటర్లకు డిమాండ్
- వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం బదిలీల్లో విచిత్రాలు



జూమ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్య తదితరులు (ఫైల్)

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 (రాయలసీమ జిల్లాలు) పరిధిలో చేపట్టిన బదిలీల ప్రక్రియ శనివారం రాత్రితో ముగిసింది. మూడు రోజులపాటు జూమ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించిన ఈ బదిలీ ప్రక్రియలో చాలా చిత్రాలు చోటుచేసుకున్నాయి. పరపతి, పలుకుబడి ఉన్న ఉద్యోగులు ఏమైనా చేద్దాం...ఉన్న కుర్చీలోనే ఉందాం...అనే రీతిలో ప్రయత్నాలు సాగించడం ఆశ్చర్యానికి గురిచేసింది.

గుర్తింపు సంఘాల లేఖలతో....

ప్రభుత్వ ఉద్యోగ సంఘాల్లో కొన్నింటికి గుర్తింపు ఉంది. ఈ సంఘాలు ఇచ్చే ఆఫీసు బేరర్స్ లెటర్లకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఈ లెటర్ల ద్వారా ఉద్యోగులు మూడేళ్లపాటు మూడు దఫాలు లేదా తొమ్మిదేళ్లు బదిలీ కాకుండా ఉన్నచోటే విధులు నిర్వర్తించే వెసులుబాటు ఉంది. దీంతో చాలామంది ఉద్యోగులు ఆఫీసు బేరర్ లెటర్స్‌ను బ్రహ్మాస్త్రంగా మలుచుకున్నారు. అందుకు ఆ సంఘాల రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు కూడా పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఉదాహరణకు కడప రిమ్స్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఒక వ్యక్తి 12 ఏళ్లకు పైగా విధులను చేపడుతున్నారు. ఆ వ్యక్తి గతంలో ఒకసారి ఒక గుర్తింపు సంఘం ద్వారా ఆఫీసు బేరర్స్ లెటర్‌ను సమర్పించారు. ఇప్పుడు మళ్లీ అదే సంఘం నుంచి ఆఫీసు బేరర్ లెటర్‌ను సమర్పించడంతో ఉన్న సీటులోనే కొనసాగడానికి ఆస్కారం ఏర్పడింది. అక్కడే ఆ ఉద్యోగి భార్య కూడా సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఆమె కూడా ఏళ్ల తరబడి అక్కడే పాతుకుపోయింది. ఈ బదిలీల్లో కూడా ఎక్కడికి వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేశారు. అందుకోసం భర్త ఉన్న గుర్తింపు సంఘం నుంచి ఆఫీసు బేరర్ లెటర్‌ను పొందడానికి ప్రయత్నించి విఫలం చెందారు. దీంతో ఉద్యోగులైన ఆ భార్యాభర్తలు మరొక గుర్తింపు పొందిన సంఘం వద్దకు వెళ్లి ఆఫీసు బేరర్ లెటర్ తెచ్చుకోవడంతో ఆమె కడప రిమ్స్ నుంచి అక్కడే ఉన్న మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యారు. మళ్లీ ఆమె డిప్యుటేషన్‌పై పాత స్థానానికి రావడానికి ప్రయత్నాలు సాగిస్తున్నట్లుగా సమాచారం.

లేని రోగం ఉందని....

ఈ బదిలీల్లో అనారోగ్యంతో ఉన్న వారు, దివ్యాంగులు, స్పౌజ్ విభాగాల్లోని ఉద్యోగులకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇందులో ప్రధానంగా చాలామంది ఉన్న సీటు నుంచి కదలకుండా ఉండేందుకు లేదా అనుకున్న చోటికి వెళ్లడానికి విచ్చలవిడిగా మెడికల్ గ్రౌండ్ కింద మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించినట్లుగా తెలిసింది. తన భార్యకు లేదా తన భర్తకు, తమ సంతానంలో ఎవరికో ఒక్కరికి దీర్ఘకాలిక వ్యాధి ఉందని, ఇక్కడే ఉంటే తాము వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంటుందనేలా సర్టిఫికెట్లను సమర్పించారు. ఇలా చాలామంది లేని రోగాన్ని ఉన్నట్లుగా మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించినట్లుగా తెలిసింది.

పని కుదరకపోతే పది వేలు పట్టుకుంటా!

కొంతమంది ఉద్యోగులు అడ్డదారుల్లో పనులు చేయించడంలో దిట్టగా పేరుగాంచారు. అందులో ఒక ఉద్యోగి బదిలీల్లో అనుకూలంగా పనిచేయడానికి ఉద్యోగస్తుల నుంచి డబ్బులు గుంజారు. ఒక వేళ పని జరగకపోతే ఇచ్చిన పైకంలో రూ. 10 వేలు పట్టుకుని మిగతాది తిరిగి ఇస్తానని చెప్పడం గమనార్హం. ఈ నేపథ్యంలో నేరుగా కాకుండా జూమ్ కౌన్సెలింగ్ చేపట్టడంతో ఆ ఉద్యోగి ప్రయత్నాలు తలకిందులయ్యాయి. కాగా ఈ బదిలీలు దాదాపుగా పారదర్శకంగా జరిగాయని ఆ శాఖ ఉద్యోగులు చెప్పడం విశేషం.

లక్షలు పలికిన లెటర్స్



ఆఫీసు బేరర్ లెటర్స్‌కు సంబంధించి ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఈ బదిలీలకు ముందు వైద్యుల బదిలీలు జరిగాయి. అప్పుడు వైద్యులు ఉన్నచోటు నుంచి కదలకుండా ఉండేందుకు ఒక గుర్తింపు కలిగిన సంఘంను సంప్రదించారు. ఆ అసోసియేషన్‌కు చెందిన వారు ఒకరి వద్ద రూ. 1.50 లక్షలకు పైగా తీసుకుని పలువురికి ఆఫీసు బేరర్ లెటర్స్ ఇచ్చినట్లుగా తెలిసింది. ఈ సంఘటన పొరుగు జిల్లాలో జరిగినట్లుగా తెలుస్తోంది. ఈ విధంగా కొన్ని గుర్తింపు కలిగిన సంఘాలు ఇష్టానుసారంగా కాసులు పుచ్చుకుని లెటర్లు ఇచ్చినట్లుగా ఉద్యోగ వర్గాలు చెప్పుకోవడం గమనార్హం.

బస్సుకు ఎఫ్‌సీ ఉందా!

- బృందాలుగా ఏర్పడి దాడులు చేస్తున్న రవాణాశాఖ అధికారులు
- నిబంధనలు పాటించకుంటే సీజ్ చేసేందుకు సిద్ధం



బడి బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా పాఠశాల, కళాశాలల బస్సులను రవాణా శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే కళాశాలలు...పాఠశాలల్లో తరగతులు మొదలయ్యాయి. ఈ తరుణంలో బడి బస్సులకు రవాణా శాఖ అధికారుల ఆధ్వర్యంలో సామర్థ్య పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) ఇవ్వాల్సి ఉంది. మరోవైపు ఆయా కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు సైతం బాధ్యతగా వ్యవహరించి ఎఫ్‌సీలు తీసుకోవాల్సి ఉంది. గత ఏడాది జారీ చేసిన సర్టిఫికెట్లకు కాలం చెల్లడంతో ప్రస్తుతం జిల్లాలో ఈ ప్రక్రియ జరుగుతోంది. విద్యా సంస్థలకు విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలు పూర్తి కండీషన్‌లో ఉన్నాయో లేదో అధికారులు తనిఖీ చేస్తున్నారు.

ఏటీసీ సెంటర్ ద్వారా ఎఫ్‌సీలు జారీ

గతంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ప్రతి వాహనాన్ని ఒకటి రెండు కిలోమీటర్లు నడిపి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసేవారు. ఈ పనిని ప్రభుత్వం ఈ ఏడాది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించింది. జిల్లాకు సంబంధించి వైవీయూ సమీపంలో ఏటీఎస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. దీంతో జిల్లాలోని అన్ని మండలాల నుంచి బడి బస్సులను ఇక్కడికే తీసుకువచ్చి ఎఫ్‌సీ పొందాల్సి వస్తోంది. ఈ ఏటీఎస్ సెంటర్‌పై ఏమాత్రం అజమాయిషీ లేకపోవడంతో రవాణాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

- జిల్లాలో దాదాపు 950 పైగా విద్యా సంస్థల బస్సులు ఉన్నాయి. వీటిలో సగం బస్సులే ఎఫ్‌సీలు తీసుకున్నట్లు సమాచారం. జిల్లాలోని రవాణాశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి బడి బస్సులను తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే బడి బస్సులపై 30 కేసులు నమోదు చేశారు.

బడి బస్సులకు ఎఫ్‌సీ తప్పనిసరి



విద్యా సంస్థల బస్సులకు తప్పని సరిగా ఎఫ్‌సీ కలిగి ఉండాలి. నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేసి జరిమానా విధిస్తాం.-నిరంజన్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఉప రవాణా శాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా

రవాణా శాఖ నిబంధనలు ఇవీ...

- స్కూల్ బస్సుకు డ్రైవర్‌గా 60 ఏళ్లు దాటిన వారు అనర్హులు.
- బస్సు నడిపే డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ సమర్పించాలి. ఇవి బస్సులో ఒకటి, యజమాని దగ్గర ఒకటి ఉండాలి.
- డ్రైవర్ నియామకాన్ని ఆర్‌టీఓ అధికారులకు తప్పనిసరిగా తెలియజేయాలి. డ్రైవర్లకు ఐదేళ్ల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- బస్సులోని అన్ని లైట్లు, సిగ్నల్స్ ఖచ్చితంగా పని చేయాలి.
- బస్సుకు నాలుగు వైపులా రిఫ్లెక్టివ్ టేపు అతికించాలి
- అధికంగా పొగ రాకూడదు.
- బ్రేకులు కండీషన్‌లో ఉండాలి
- కొత్తగా పెయింటింగ్ వేయించాలి
- ఎమర్జెన్సీ డోర్, అగ్ని ఆర్పే పరికరం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పని సరిగా ఉండాలి.

ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన బాబు

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



బాలరాసజపల్లె గ్రామంలో పర్యటిస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్: చంద్రబాబునాయుడు ప్రజా సమస్యలను గాలికి వదిలేశాడని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని బాలరాసపల్లె గ్రామంలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర పేరుతో మూడు వందల కోట్లకు పైగా ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశాడని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నా, రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. యోగాంధ్రకు చేసిన ఖర్చుతో అనేక ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేవన్నారు. చంద్రబాబు నాయుడు పాలన పచ్చ పత్రికల్లో తప్ప మరెక్కడా కనిపించడం లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదయినా ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోగా ఎన్నికల హామీలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఏడాది కాకముందే ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. జగన్ ఎక్కడ పర్యటించినా ప్రజలు వేలాదిగా తరలి రావడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ప్రజల్లో జగన్‌కు ఉన్న స్పందన చూస్తే వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా ఒక్క సీటు కూడా సాధించలేవన్నారు.

- నందలూరుకు చెందిన రిటర్డ్ రైల్వే డాక్టర్ భాస్కర్ కుమారుడు ధీరజ్‌కుమార్ గత సివిల్స్ ఫలితాల్లో ర్యాంకు సాధించి మహారాష్ట్రలో ఎస్పీగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి ఆదివారం ఆయనను ఎస్టేట్‌కు ఆహ్వానించి సత్కరించారు.

నేడే యువత పోరు



వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు సోమవారం కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పార్టీ కార్యాలయం నుంచి 10.30 గంటలకు ప్రారంభమై ర్యాలీ కలెక్టరేట్ వరకు చేరుకోనుంది. అక్కడ నిరసన ప్రదర్శన నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో 35 వేల మంది నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా. అలాగే సుమారు లక్ష మంది ఉన్నత విద్యను అభ్యసించిన వారు ఉన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా నిరుద్యోగులకు ఇచ్చిన ఏ హామీని కూడా అమలు చేయలేదు. పైగా రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల మంది వలంటీర్లను ఈ ప్రభుత్వం తొలగించింది. మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్ మెన్లను తొలగించారు. ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహనాలను తీసేయడంతో ఇందులో డ్రైవర్లుగా పనిచేసే వారికి పని లేకుండా పోయింది. ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టారు అన్న ఆక్రోషం నిరుద్యోగుల్లో ఉంది. ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి ఖాళీలు భర్తీ చేస్తామని చెప్పి ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఖాళీలు తక్కువగా చూపారు అన్న విమర్శలు కూడా ఉన్నాయి. అలాగే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంతో వారిని కాలేజీల యాజమాన్యాలు వేధిస్తున్నాయి. సర్టిఫికెట్లు ఇవ్వకుండా, ఫలితాలు ప్రకటించకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర యువజన విభాగం ఆందోళనకు పిలుపునిచ్చింది.

కౌలు రైతులకు కార్డులందేనా

- ఖరీఫ్ మొదలై 20 రోజులు దాటినా అరకొర కార్డులే పంపిణీ
- బ్యాంకు రుణాల కోసం కౌలు రైతుల ఎదురు చూపులు



దువ్వూరు ప్రాంతంలో పసుపు సాగు చేస్తున్న రైతు


కడప అగ్రికల్చర్: అన్నదాతలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోంది. ఖరీఫ్ మొదలై 20 రోజులు దాటినా కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో తీవ్ర అలసత్వం చూపిస్తోంది. ఫలితంగా కార్డులందక.. రుణాలు దక్కక కౌలు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2025-26 సీజన్‌కుగాను జిల్లాలో 11000 వేల కౌలు రైతులకు గుర్తింపుకార్డుల పంపిణీ లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు కేవలం 102 కార్డులు మాత్రమే పంపిణీ చేశారు. నిజానికి జిల్లావ్యాప్తంగా అధికారంగా 40 వేల మందికిపైగా కౌలు రైతులు ఉన్నట్లు అంచనా కాగా అంతకంటే ఎక్కువగానే జిల్లాలో కౌలు రైతులు ఉన్నారు. కాగా కార్డుల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు గ్రామ సభలు నిర్వహించలేదు.

గ్రామ సభలు ఏవీ?

సాధారణంగా పంటల సీజన్ మొదలవ్వగానే కౌలు కార్డుల పంపిణీకి సంబంధించి రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేస్తారు. కానీ అలాంటి ప్రక్రియ జరగడం లేదని కౌలు రైతులు తెలిపారు. ఈ నేపథ్యంలో కౌలు రైతులు పంటలసాగుకు బయట వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ కడపజిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 11,000 కౌలు కార్డులు మంజూరు లక్ష్యంగా ఉండగా ఇప్పటికి 102 కార్డులు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ ఏడాది కౌలు కార్డుల లక్ష్యం.. **11,000**

ఇప్పటి వరకు పంపిణీ చేసిన కౌలు కార్డులు: **102**



కౌలు రైతులకు అండగా జగన్ సర్కార్

కౌలు రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. భూ యజమానుల హక్కులకు భంగం కలగకుండా కేవలం 11 నెలల కాలానికి సాగు ఒప్పందం చేస్తూ 2011 కౌలు చట్టాన్ని సవరించింది. ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి ఒక సారి జారీ చేసిన కార్డును మళ్లీ యజమాని అంగీకారం మేరకు రెన్యూవల్ చేసుకునే వీలు కల్పించారు. భూ యజమానుల్లో అపోహలు తొలగించడంతో జిల్లాలో సీసీఆర్‌సీ కార్డుదారులు జారీ గణనీయంగా పెరిగింది. అసలు రైతులు మాదిరిగా కౌలు రైతులకు పంట రుణాలు అందించడంతోపాటు రైతు భరోసా, పంటల భీమా పరిహారం అందించి అండగా నిలిచింది.

సకాలంలో కౌలు కార్డులను మంజూరు చేయాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై ఇరవై రోజులు దాటింది. ఇంత వరకు వందకుపైగా మాత్రమే కార్డు లు పంపిణీ చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమం ముమ్మరం కావాలంటే వ్యవసాయ, రెవిన్యూశాఖలు గ్రామ సభలను ఏర్పాటు చేసి రైతులకు కార్డుల పంపిణీ ముమ్మరం చేయాలి. కౌలు కార్డులను సకాలంలో ఇవ్వకపోతే రైతు భరోసా, పంట రుణాల పెట్టుబడి, పంటలబీమా, సబ్సిడీ విత్తనాలు వంటి అందే పరిస్థితి ఉండదు. - బి. దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

కార్డుల పంపిణీ మొదలైంది



కౌలు రైతుల కార్డుల పంపిణీ జిల్లాలో ప్రారంభమైంది. ఈ విషయమై వీఆర్‌ఓలు, వ్యవసాయ అధికారులతో పర్యవేక్షిస్తున్నాం. ఈ ఏడాది 11 వేల కార్డుల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా వందకుపైనే కౌలు రైతులకు కార్డులను పంపిణీ చేశాం. మిగతా కార్డులను కూడా వీలైనంత త్వర గా పంపిణీ చేసేందుకు కృషి చేస్తాం. - చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

గంగమ్మకు బోనాల సమర్పణ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా లక్కిరెడ్డి పల్లె మండల పరిధిలోని అనంతపురంలో గంగమ్మ ఆలయం విరాజిల్లుతోంది. ఆదివారం ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. గంగమ్మా ..కరుణ చూపు తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు.కొందరు బోనాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురిపించి పంటలు బాగా పండేలా దీవించమ్మా అంటూ రైతులు వేడుకున్నారు. పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

27 నుంచి ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలు

మదనపల్లె సిటీ: కేరళలోని కొజికోడ్‌లో జూన్ 27 నుంచి 30 వరకు ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలు జరగనున్నాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సర్వేపల్లి అన్నారు. ఆదివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్స్‌ను స్థానికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 50లక్షల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థిసంఘంగా ఎస్ఎఫ్ఐ ఉందన్నారు.

క్లుప్తంగా

తండ్రిపై కుమారుడి ఫిర్యాదు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో కాగితాలపెంట సమీపంలో నివాసముంటున్న నిజాం, ఫర్హానాల కుమారుడు హసీం తన తండ్రిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తల్లి మూడు నెలల క్రితం మృతి చెందిందని, అప్పటినుంచి తండ్రి తనను పట్టించుకోలేదని, తన మేనమామ వద్దనే ఉంటున్నానని తెలిపాడు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పట్టపగలు ఇంటిలో చోరీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో విజయదుర్గా కాలనీ సమీపంలో రామాంజనేయపురంలో నివాసముంటున్న లక్ష్మీదేవి అనే మహిళ ఆదివారం చికెన్ కోసం ఇంటికి తాళం వేసి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేలోపు తాళం పగలగొట్టి ఇంటిలో 10 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకుని వెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం


తేజేశ్వరి(ఫైల్)

జమ్మలమడుగు : మైలవరం మండలం బుచ్చంపల్లి పంచాయతీ మురపంది గ్రామానికి చెందిన మూడే తేజేశ్వరి అదృశ్యమైంది. ఈమేరకు భర్త మూడే కేశాలు నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్యామసుందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 19వతేదీ ఉదయం ఇంటి నుంచి కరువు పనికి వెళ్లి ఫొటోలు దిగి వస్తానని వెళ్లిన తేజేశ్వరి తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువుల ఇళ్లలో విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కరెంటు షాక్‌తో రైతు మృతి


మృతి చెందిన రైతు రమణయ్య

మైలవరం : మండల పరిధిలోని ధన్నవాడ గ్రామంలో జొన్న పంటకు నీరు కట్టేందుకు మోటార్ స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రాసిబోయిన రమణయ్య(42) అనే రైతు మృతి చెందాడు. భార్య దస్తగిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రైతు ఆదివారం మొక్క జొన్న పంటకు నీరు కట్టేందుకు వెళ్లాడు. అయితే విద్యుత్ తీగలు బయటికి వచ్చి ఉండటాన్ని గమనించలేదు. అవి కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తలమంచిపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

పొలంలో తెగి పడిన కాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కొత్తపల్లికి చెందిన బైరెడ్డి (38) అనే రైతు కాలు ప్రమాదవశాత్తు తెగి పడింది. వివరాలిలా.. ఆదివారం రోటివేటర్‌తో పొలాన్ని చదును చేసే క్రమంలో వదులుగా ఉన్న రోటివేటర్ బోల్ట్‌లను బిగించే ప్రయత్నం చేస్తుండగా ట్రాక్టర్ ఒక్కసారిగా ముందుకు దూసుకుపోయింది. దీంతో బోల్ట్‌లు బిగిస్తున్న బైరెడ్డి కాలు మోకాలి వరకు తెగిపోయింది. గ్రామస్తులు వెంటనే 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

టీడీపీలో కులాల కుంపటి.!

- ఇన్‌చార్జి కుర్చీకోసం బలిజల సిగపట్లు
- బలిజేతర నేతలపై అధిష్టానం దృష్టి ?
- తాజాగా తెరపైకి కడపకు చెందిన బలిజ నేత



రాజంపేట : వర్గ విభేదాలకు నిలయమైన రాజంపేట తెలుగుదేశం పార్టీలో అధికారపెత్తనం కోసం కులాల కుంపటి రాజుకుంటోంది. ఆదివారం నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలోని తోట కళ్యాణ మండపంలో నియోజకవర్గ వ్యాప్తంగా బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశం ప్రధానంగా టీడీపీలో బలిజలకు అన్యాయం జరిగిందనే విధంగా కొనసాగినట్లుగా అధిష్టానానికి నివేదికలు వెళ్లినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నియోజకవర్గంలోని రాజంపేట టౌన్, రాజంపేట రూరల్, నందలూరు, ఒంటిమిట్ట, సుండుపల్లె, వీరబల్లి మండలాలకు చెందిన బలిజ సామాజికవర్గానికి చెందిన గ్రామ, మండల స్థాయి నేతలు తరలి వచ్చారు. 500 మంది వచ్చినట్లుగా లెక్కలు వేసుకుంటున్నారు. అయితే టీడీపీకి చెందిన బలిజ సామాజిక వర్గంలో పేరొందిన సీనియర్లు , ముఖ్యనేతలు పాల్గొనకపోవడం గమనార్హం

ఇన్‌చార్జి పదవి తమకే ఇవ్వాలనే అల్టిమేటం..

టీడీపీ ఇన్‌చార్జి పదవి తమకే ఇవ్వాలనే అల్టిమేటం ఆత్మీయ సమావేశం ద్వారా అధిష్టానానికి ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇప్పటికే టీడీపీలో పసుపులేటి బ్రహ్మయ్య, బత్యాల చెంగల్రాయుడు, సుగవాసి బాలసుబ్రమణ్యం లాంటి బలిజ నేతలకు అన్యాయం జరిగిందనే భావన సమావేశంలో నేతలు వ్యక్తం చేసుకున్నారు. సమావేశంలో కడపలో ఉంటున్న హరిప్రసాద్, మోదుగల కళావతమ్మ ఇంజినీరింగ్ కళాశాల అధినేత పెంచలయ్య సోదరులు, కుప్పాల వెంకటసుబ్బయ్య, ప్రముఖ న్యాయవాది కృష్ణకుమార్, బండారు బాలయ్య, పూల భాస్కర్, వెంకటసుబ్బయ్యతోపాటు వివిధ మండలాలకు చెందిన బలిజ నేతలు, రాజంపేట పట్టణానికి చెందిన నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా టీడీపీ ఇన్‌చార్జి పదవి హరిప్రసాద్‌కు ఇవ్వాలనే డిమాండ్ పరోక్షంగా బలిజనేతలు తెరపైకి తీసుకొచ్చారు. ఈయన కడపకే పరిమితమైన నాయకుడిగా చెలామణి అవుతున్నా ఇప్పుడు తాను ఒంటిమిట్ట మండలానికి చెందిన వ్యక్తిననే భావనతో ఇన్‌చార్జి రేసులోకి వచ్చారు.

బలిజలకు అధిష్టానం అనుకూలమా.. ప్రతికూలమా..

టీడీపీ ఇన్‌చార్జి పదవి బలిజేతరుల నేతలకు ఇవ్వడానికి అధిష్టానం దృష్టి సారించినట్లుగా పార్టీ వర్గాల్లోనే ప్రచారం జరుగుతోంది. అందువల్లనే బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు తరచూ ఆత్మీయ సమావేశాలు పెట్టుకొని టీడీపీ కుర్చీని దక్కించుకోవాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. వీరికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుకూలమా, ప్రతికూలమా అనేది ఇంకా బహిర్గతం కాలేదు. ప్రస్తుతానికి ఇన్‌చార్జిని ప్రకటించే విషయంలో అధిష్టానం వెనకడుగుపై అనేక ఆలోచనలు, అనుమానాలు పుట్టుకొస్తున్నాయి.

బలిజేతరుల వైపు చూపు..!

ఇప్పటికే క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన, రాజు విద్యాసంస్థల అధినేత చమర్తి జగన్‌మోహన్‌రాజు, రెడ్డి సామాజికవర్గం నుంచి మేడా విజయశేఖర్‌రెడ్డిలు ఇన్‌చార్జి పదవిని ఆశిస్తున్నారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, రాయచోటికి చెందిన సుగవాసి బాలసుబ్రమణ్యంను అధిష్టానం గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేయించింది. వారి ఓటమి తర్వాత ఆ సామాజికవర్గం దిశగా ఇప్పుడు అధిష్టానం ఆలోచన చేయడం లేదన్న వాదన పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. కానీ బలిజలు రాజంపేట తమదే.. టీడీపీ కుర్చీ తమకే అన్నట్లుగా భీష్మించుకొని కూర్చున్నారు. అధిష్టానం ఎటువైపు మొగ్గుచూపుతుందో వేచి చూడాల్సిందే.


బలిజల ఆత్మీయ సమావేశం వేదికపై బలిజ నేతలు

జగనన్నతోనే సామాజిక న్యాయం

- బీసీలందరం జగనన్నకు అండగా నిలుద్దాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్
- నూతన బీసీ విభాగం నాయకులకు దిశా నిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

కడప కార్పొరేషన్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు ఎన్. శివరామ్ ఆధ్వర్యంలో బీసీ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వంలో బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన జగనన్న జ్యోతిరావు పూలే ప్రతిరూపంగా నిలిచిపోయారని కొనియాడారు. కానీ నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీలపైన భౌతిక దాడులు, హత్యాయత్నాలు, అక్రమ కేసులతో వేధిస్తోందని విమర్శించారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బీసీలంటే బ్యాక్‌బోన్ క్లాస్ అని గుండెల్లో పెట్టుకున్న జగనన్నకు బీసీలందరం అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నలభై సంవత్సరాల నుంచి బడుగు బలహీన వర్గాలను కేవలం ఓటర్లుగానే చూశారన్నారు. కుల వృత్తులకు, చేతి వృత్తులకు పరిమితం చేసి రాజ్యాధికారానికి దూరం చేశారన్నారు. నలభై సంవత్సరాల యువనేత జగన్ మోహన్ రెడ్డి పార్టీ స్థాపించిన పదేళ్లలోనే ఎన్నికల్లో అత్యధిక భాగం ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు బీసీలకు ఇచ్చి చట్ట సభలకు పంపారని, తద్వారా నిజమైన సామాజిక న్యాయానికి ఊపిరి పోశారని కొనియాడారు. రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బసవరాజు, కార్యదర్శి కె.శివయాదవ్ మాట్లాడుతూ నాడు జగనన్న బీసీల పక్షపాతిగా బీసీల అభివృద్ధికి కృషి చేశారని, నేడు కూటమి నేతలు బీసీల వ్యతిరేకులుగా మారి అరాచకాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీసీ కనుకే కడప మేయర్ సురేష్ బాబును రాజకీయంగా వేధిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఎస్. యానాదయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు నాగయ్య, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు శివ సుబ్రహ్మణ్యం, దూదేకుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రసూల్, బాదుల్లా, బసవరాజు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, సునీత, శివమ్మ, సభ్యులతో పాటు వైస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర స్థాయి కమిటీ నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, నియోజకవర్గ అధ్యక్షులు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా అచీవర్స్ డే


అచీవర్స్‌డేలో పాల్గొన్న ఉద్యోగాలు పొందిన విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు

చింతకొమ్మదిన్నె : కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ మల్టీ నేషనల్ కంపెనీలైన టెక్ మహేంద్ర, కాగ్నిజెంట్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎంఫసిస్, ఎంకోరేటా, మెగా స్మార్ట్ సొల్యూషన్స్‌లలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అచీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 2024-2025 విద్యా సంవత్సరం క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో అత్యధిక ఉద్యోగాలు పొందడంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందన్నారు. తమ కళాశాల ఛైర్మన్ సి.గంగిరెడ్డి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెచ్-ఎస్ విభాగాధిపతి కేఎస్ శశికుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఓ.హోమకేశవ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గండికోటను సందర్శించిన జిల్లా ఎస్పీ


రోప్‌వే ద్వారా పెన్నానది లోయను దాటుతున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జమ్మలమడుగు రూరల్ : జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సతీ సమేతంగా పిల్లలతో కలసి ఆదివారం పర్యాటక కేంద్రమైన గండికోటను సందర్శించారు. గండికోటలోని జుమ్మా మసీదు, స్పోర్ట్స్ అకాడమీ, పెన్నానది లోయ, రంగనాథస్వామి ఆలయం, కోటలోని ఆలయ పరిసరాలను చూసిన కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ గుర్రప్పస్వామి, రోప్‌వేను పరిశీలించారు. రోప్‌వే ద్వారా పెన్నానది లోయను దాటారు. పట్టణ సీఐ ఎస్. లింగప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుపై కత్తులతో దాడి

రూ. 4 లక్షల సొమ్ము దోపిడీ


దాడిలో గాయపడిన లక్ష్మిరెడ్డి

ముద్దనూరు : మండలంలోని సోంపల్లె గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి నలుగురు వ్యక్తులు మూలె లక్ష్మిరెడ్డి అనే రైతుపై కత్తులతో దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ.4లక్షల10వేల నగదును దోచుకుని పరారయ్యారు. బాధితుని సమాచారం మేరకు లక్ష్మిరెడ్డి మామిడికాయల వ్యాపారం నిమిత్తం బెంగళూరు వెళ్లి అక్కడ మామిడికాయల మండి నుంచి రూ.4లక్షల10వేల నగదు తీసుకుని హిందూపురం వరకు రైలులో ప్రయాణించాడు. హిందూపురం నుంచి మోటార్ బైకులో స్వగ్రామం సోంపల్లెకు బయలుదేరాడు. లక్ష్మిరెడ్డి సోంపల్లె వద్దకు చేరుకోగానే నలుగురు దుండగులు అతని బైక్‌ను ఆపి కత్తులతో దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిరెడ్డి వద్ద ఉన్న సొమ్మును దోచుకుని పారిపోయారు. గాయపడిన వ్యక్తిని వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దుప్పి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో దుప్పి మాంసం విక్రయిస్తున్న కొనిరెడ్డి రామసుబ్బారెడ్డి అనే వ్యక్తిని ఆదివారం అటవీశాఖ అధికారి శ్యామసుందర్ ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

భర్తపై గొడ్డలితో దాడి

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాదం చోటుచేసుకుని భర్తపై భార్య గొడ్డలితో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. తట్టివారిపల్లె పంచాయతీ టిడ్కో ఇళ్ల వద్ద నివాసం ఉంటున్న మోహన్ నాయక్(45) తన భార్య శారదతో కుటుంబ అవసరాల కోసం ఉంచిన నగదు ఖర్చు విషయమై వివాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో గొడ్డలి తీసుకుని శారద భర్త మోహన్‌నాయక్‌పై దాడిచేసింది. దాడిలో మోహన్‌నాయక్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భార్యపై దాడి

మదనపల్లె రూరల్ : మద్యం తాగేందుకు భార్య నగదు ఇవ్వకపోవడంతో భర్త దాడిచేసిన ఘటన ఆదివారం మదనపల్లెలో జరిగింది. నెమలినగర్ వడ్డిపల్లెలో భార్యాభర్తలు మోహన్, గాయత్రి నివాసం ఉంటున్నారు. మోహన్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. అందులో భాగంగా ఆదివారం తనవద్ద మద్యం సేవించేందుకు డబ్బు లేకపోవడంతో భార్య గాయత్రిని అడిగాడు. ఆమె తనవద్ద లేదని సమాధానం ఇవ్వడంతో ఆవేశానికి లోనై ఇటుక రాళ్లతో ఆమెపై దాడి చేశాడు. దాడిలో ఆమె తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మద్యం తాగుతుండగా మంటలు అంటుకుని గాయాలు

మదనపల్లె రూరల్ : స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్న ఓ వ్యక్తికి మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పీలేరుకు చెందిన గిరి(32) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. రాత్రి పట్టణంలోని కదిరిరోడ్డులో ఉన్న ఓ మద్యం దుకాణంలో స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు కూర్చున్నాడు. ఈ క్రమంలో సిగరెట్ వెలిగించేందుకు ప్రయత్నించగా, అగ్గిరవ్వలు పక్కనే ఉన్న మద్యం గ్లాసులో పడటంతో అంటుకుని మంటలు చెలరేగాయి. గిరి శరీరంపై మంటలు వ్యాపించడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఇటుకల బట్టీకి చెరువు మట్టి

కలికిరి : చెరువుల్లో మట్టి తరలింపునకు ఇరిగేషన్ శాఖ అధికారులు అధికారికంగా అనుమతులిస్తున్నారు. సాధారణంగా రైతులు తమ పొలాలకు మట్టి అవసరమై ఇరిగేషన్ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుని తగిన భూమి ఆధారాలు, ఇరిగేషన్ శాఖకు నామమాత్రపు రుసుము చెల్లించాలి. దీంతో ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత చెరువు నుంచి పొలానికి అవసరమైన మట్టిని తరలించుకోవడానికి అనుమతులు జారీ చేయాలి. ఇలాగే మండలంలోని పల్లవోలు గ్రామంలో గడికి చెందిన కొందరు రైతులు తమ పొలాలకు మట్టి అవసరమని సంబంధిత రికార్డులతో సహా ఇరిగేషన్ శాఖ అధికారులకు గడి సమీపంలోని గుంతలవానిచెరువు నుంచి మట్టి తరలించడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎలాంటి క్షేత్ర స్థాయి పరిశీలనలు చేపట్టని అధికారులు ఏకపక్షంగా ఒక రైతుకు మాత్రమే అనుమతి ఉత్తర్వులు జారీ చేసి, మిగిలిన రైతులను నిత్యం కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. రాజకీయ అండదండలుంటేనే మట్టి తరలింపునకు అనుమతులు ఇస్తామని స్వయంగా ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతుండటంతో గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన వ్యక్తి మాత్రం పొలానికి కాకుండా ఇటుకల వ్యాపార నిమిత్తం బట్టీకి మట్టిని రాత్రి పగలు తేడా లేకుండా తరలించుకుంటున్నాడు. దీనిపై ఇరిగేషన్ శాఖ మండల ఇన్‌చార్జి జేఈ గోపీక్రిష్ణను వివరణ కోరగా రైతుకు పొలానికి మట్టి తరలించడానికి అనుమతి ఇచ్చామని, ఇటుకల బట్టీకి మట్టి తరలిస్తుండటం తమ దృష్టికి రాలేదన్నారు.

‘మైనార్టీ సంక్షేమం’లో నిధులను మింగేశారు

నిశ్శబ్దంగా ఉండే జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖలో అవినీతి బాంబు పేలింది. ఎవరూ ఊహించని విధంగా అక్రమాలు జరగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ శాఖను కాపాడాల్సిన అధికారే నిధులను మింగేశాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- రూ. 3.50 కోట్లకు పైగా గోల్‌మాల్
- సంచలనంగా మారిన అక్రమాలు
- అధికారుల విచారణ

కడప రూరల్ : జిల్లా మైనార్టీ సంక్షేమశాఖకు 2023లో డిప్యుటేషన్‌పై ఓ అధికారి వచ్చారు. ఆయన 2025 ఏప్రిల్ వరకు విధులను చేపట్టారు. ఏకంగా ఆయన ఆ శాఖకే కన్నం వేశారు. ఎంత అవినీతి జరిగింది స్పష్టంగా తెలియనప్పటికీ రూ. కోట్లలోనే కాజేసినట్లుగా తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.

అవినీతి జరిగిందిలా...

షాదీఖానాల నిర్మాణాలు, చర్చిల మరమ్మతులు తదితర సంబంధిత నిధులు జిల్లా కలెక్టర్ పేరుతో బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. అవినీతికి పాల్పడిన ఆ అధికారి జిల్లా కలెక్టర్ పేరుతో కొత్తగా అకౌంటు ఓపెన్ చేశారు. బ్యాంకులో ఉండే నిధులను సెల్ఫ్ చెక్కుల ద్వారా డ్రా చేశారు. అలాగే కార్యాలయంలో పనిచేసే ఒకరిద్దరి పేరు మీద కూడా చెక్కుల ద్వారా నిధులను డ్రా చేసుకున్నారు. అలా డ్రా చేసిన నిధులను పక్కదారి పట్టించారు. ఇలా దాదాపు రూ. 3.50 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయి.

వెలుగు చూసిందిలా

ప్రభుత్వం వివిధ శాఖల ఆర్థిక అంశాలకు సంబంధించి జమ, ఖర్చుల వివరాలను కోరుతోంది. ఆ మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖకు వివరాలు పంపాలని ఆదేశించారు. ఇక్కడి నుంచి ఆ శాఖ అధికారులు పంపిన వివరాల్లో తప్పులు ఉన్నట్లుగా ఉన్నతాధికారులు గమనించారు. ఈ అంశాన్ని జిల్లా కలెక్టరేట్‌కు పంపి ఆ శాఖలో ఫైళ్లను పరిశీలించాలని ఆదేశించారు. దీంతో అక్కడ జరిగిన అవకతవకలు వెలుగుచూశాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో విచారణ సాగుతున్నట్లుగా తెలిసింది. ఈ అక్రమాలకు సంబంధించి అవినీతికి పాల్పడిన అధికారితోపాటు మరొక ఉద్యోగి అందుబాటులో లేనట్లుగా సమాచారం.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్


జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ హెచ్చరించారు. జిల్లాలో గత 15 రోజుల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ జరిపిన దాడుల వివరాలను జిల్లా ఎస్పీ వివరించారు.

మట్కా, గ్యాంబ్లింగ్ పై ముమ్మర దాడులు

జిల్లాలో గత 15 రోజుల్లో 13 మట్కా కేసుల్లో మొత్తం 43 మంది అరెస్టు చేసి రూ. 2,11,930 నగదు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 106 మంది జూదరులను అరెస్టు చేసి రూ. 1,82,650 నగదు స్వాధీనం చేసుకుని 19 కేసులు నమోదు చేశారు.

క్రికెట్ బెట్టింగ్

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న 8 మందిని అరెస్టు చేసి రూ. 76,000 నగదు స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బహిరంగ మద్యపానంపై దాడులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవిస్తున్న వారిపై ముమ్మర దాడులు నిర్వహించి 235 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 52 మందిపై కేసులు నమోదు చేశారు.

కోడి పందేలపై దాడులు

మూడు కోడి పందేల కేసుల్లో మొత్తం 21 మందిని అరెస్టు చేసి రూ. 81,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 3.24 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

అసాంఘిక కార్యక్రమాల నిర్మూలనకు పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని, మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, ఇతర నేరాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 112 కు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జిల్లా ఎస్పీ వివరించారు.

ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు ప్రారంభం


101 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మెన్ నాగ కుళ్లాయప్ప


4 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ సాయి చరణ్


86 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మెన్ మన్విత్ రెడ్డి


78 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మెన్ కారుణ్య ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆదివారం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 89.2 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 399 పరుగులు చేసింది. ఆ జట్టులోని నాగ కుళ్లాయప్ప 182 బంతుల్లో 17 ఫోర్లతో 101 పరుగులు చేసి అద్భుతంగా ఆడారు. సాయి ఆర్థిత్ 60 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. ధనుష్ 2, తేజేష్ 2 వికెట్లు తీసుకున్నారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలో..

అదే విధంగా వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో నెల్లూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి, ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 362 పరుగులు చేసింది. ఆ జట్టులోని మన్విత్‌రెడ్డి 87 బంతుల్లో 86, కారుణ్య ప్రసాద్ 78, చైతన్య తేజ 62 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని రేవంత్ 2 వికెట్లు తీశాడు.

భర్త మరణాన్ని మరువక ముందే భూమి ఆక్రమణ

- న్యాయం చేయకపోతే సామూహిక ఆత్మహత్యే శరణ్యం
- ఉన్నతాధికారులకు బాధితురాలి ఫిర్యాదు


అంగళ్లులో ఆక్రమిత భూమి వద్ద అత్త, బిడ్డలతో నిరసన తెలుపుతున్న బాధితురాలు శకుంతల

కురబలకోట : విద్యుత్ షాక్‌తో భర్తను కోల్పోయి తేరుకోక మునుపే వితంతువు భూమిని ఓ కుటుంబం ఆక్రమించడం మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది. కురబలకోట మండలం అంగళ్లులో ఈ దుస్సంఘటన జరగడం కలవరాన్ని కల్గిస్తోంది. మనో వేదనలో ఉన్న వితంతువు భూమిని ఆక్రమించి ఆమెను తీవ్ర మనోవేదనకు గురిచేయడం పట్ల అంతటా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వయో వృద్ధురాలైన అత్త, మరో వైపు చిన్నబిడ్డలతో ఉన్న ఆమె ఈ దుర్మార్గంపై కన్నీటి పర్యంతమవుతున్నారు. భూ ఆక్రమణపై బాధితురాలు గాండ్లపెంట శకుంతల ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు. మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన యువరైతు గాండ్లపెంట రెడ్డెప్పరెడ్డి (38) ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న అతని ఆకస్మిక మృతితో ఆ కుటుంబం ఇంకా కోలుకోలేదు. ఈ క్రమంలో అంగళ్లులో కడప మార్గంలో హైవే పక్కన ఉన్న ఆమెకు చెందిన 92 సెంట్ల భూమిపై మండలంలోని తుమ్మచెట్లపల్లెకు చెందిన ఓ కుటుంబం కన్నేసి ఆక్రమించిందని బాధితురాలు శకుంతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లిటిగేషన్ డాక్యుమెంట్ సృష్టించి అధికార పార్టీ అండతో భూ ఆక్రమణకు పాల్పడ్డారని వేదన పడుతోంది. ఏళ్లుగా వంశ పారంపర్యంగా ఆధీనంలో వున్న భూమికి న్యాయం చేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడతామని ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా ఆక్రమిత భూమి వద్ద బాధితురాలు అత్త బిడ్డలతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. భర్త ఉన్నప్పుడు భూమి వైపు కన్నెత్తి చూడలేదు. అతను చనిపోయాక దౌర్జన్యంగా భూ ఆక్రమణకు పాల్పడి చుట్టూ ఫెన్సింగ్‌లా రాళ్లు నాటారని తెలిపారు. ఏళ్లుగా ఆధీనంలో ఉంటూ భూ హక్కు పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పట్టాదారు పాసు బుక్కులు కూడా ఉన్న తమ భూమిని ఆక్రమించడం ఏమిటని బాధితురాలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై అధికారులను విచారించగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి


మోదం నాగభూషణంను సన్మానిస్తున్న గాలివీటి విజయభాస్కర్ రెడ్డి

వీరబల్లి : చేనేత కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదం నాగభూషణం కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత జగనన్న ప్రభుత్వంలో ప్రతి చేనేత కార్మికుల ఖాతాలో సంవత్సరానికి రూ. 24 వేలు జమ చేసేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వారి గురించి పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన మోదం నాగభూషణంను గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీ విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి సన్మానించారు.